క్లుప్తంగా

ఘనంగా మదర్ థెరెస్సా జయంతి


తాటివారిపాలెం ప్రభుత్వ పాఠశాలలో మదర్ థెరెస్సా జయంతి

మార్టూరు: దీన జన బాంధవురాలు భారత రత్న మదర్ థెరెస్సా జయంతి మంగళవారం మండలంలోని తాటివారిపాలెం ఎంపీపీ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మధర్ థెరెస్సా చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆమె సేవలను తెలియజేసి నోటు పుస్తకాలు పంపిణీ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాదాల సాంబశివరావు ప్రధానోపాధ్యాయులు కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌలు కార్డులు తీసుకోండి


పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

చీరాల రూరల్: భూ యజమానుల వద్ద కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసే కౌలు రైతులు కౌలుదారు కార్డులను తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి. నిర్మలాదేవి సూచించారు. మండలంలోని బోయినవారిపాలెం, తోటవారిపాలెంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రైతులనుద్దేశించి మాట్లాడారు. కౌలుదారు కార్డులు తీసుకుంటే ఇ-క్రాప్ చేసుకోవడానికి వీలవుతుందని సూచించారు. వీఏఏలు జ్యోతి, నీలిమ, పావని, జ్యోతి, పద్మజ, రైతులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ


డ్రోన్‌పై పురుగు మందుల పిచికారీపై వివరిస్తున్న వ్యవసాయాధికారి

ఇంకొల్లు (చినగంజాం): డ్రోన్‌తో పురుగు మందులు పిచికారీ చేసే విధానంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారి ఎస్. మేరిమ్మ సూచించారు. పూసపాడు, హనుమోజీపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి ఎస్. మేరిమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. పూసపాడులో రైతులకు డ్రోన్‌తో పైరుపై పురుగు మందు పిచికారీ చేసే విధానంపై అవగాహన కల్పించారు. డ్రోన్ ద్వారా 12 లీటర్ల నీటిలో ఒక ఎకరా మోతాదు మందును కలిపి ఆరు నిమిషాల్లో ఒక ఎకరాలో పిచికారీ చేయవచ్చని తెలియజేశారు. హనుమోజీపాలెంలో పత్తి పంటలో ఎరువుల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, పంటసాగు హక్కు పత్రాలు గురించి అవగాహన కలగ జేశారు. అలెగ్జాండర్, రైతులు పాల్గొన్నారు.

బాల్యం భారం

- కనిపించని నో బ్యాగ్ డే కార్యక్రమం
- నర్సరీ నుంచే పుస్తకాల మోత
- ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం


స్కూల్ బ్యాగులతో విద్యార్థులు

వేటపాలెం: అందమైన బాల్యానికి పుస్తకాలే భారంగా మారుతున్నాయి. చదువుల ఒత్తిడిలో చిన్నారుల ఆందోళన కొంతవరకైనా తగ్గించేందుకు ఉపయోగ పడేదే నో బ్యాగ్ డే కార్యక్రమం. అయితే దీని అమలుపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. నర్సరీ నుంచే వయసుకు మించిన బరువు (బ్యాగు నిండా పుస్తకాలు)ను చిన్నారులు మోయాల్సిన పరిస్థితి నెలకొంది. ఏటా ఈ బరువు పెరుగుతూ పోతుండటం ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థి తన శరీర బరువులో రెండు వంతుల బరువు అదనంగా మోస్తే అది పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులపై స్కూల్ బ్యాగు బరువు భారం తగ్గించాలని కొన్ని నిబంధనలను ఎన్సీఈఆర్టీ (జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి) విడుదల చేసింది. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పుస్తకాల సంచి పరిమాణం తగ్గిస్తూ రాష్ట్రాలకు.. కేంద్రానికి కూడా సూచనలు చేసింది. ఈ క్రమంలో నెలలో మొదటి, మూడో శనివారం నో బ్యాగ్ డేగా నిర్వహించాలని తెలిపింది.

ప్రైవేటు పాఠశాలల్లోని చిన్నారులకు..

ఒకటి, రెండు తరగతులకు రెండు పుస్తకాలు (భాష, గణితం, పరిసరాల విజ్ఞానం) ఉండాలి. సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) అయితే సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తోంది. అయితే ఇప్పుడు ఒకటి, రెండు తరగతులకు ఎనిమిది పుస్తకాలు, తరగతి పెరిగే కొద్దీ ఇంకా ఎక్కువ పాఠ్యపుస్తకాలు మోయాల్సి వస్తోంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు భారం తప్పడం లేదు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల పరిస్థితి అత్యంత దారుణంగా ఉంటుంది.

ఏడాదికి 10 రోజులు

విద్యార్థుల్లో ఆహ్లాదం నింపేందుకు అనుభవ పూర్వక పాఠాలను నేర్పేందుకు పుస్తకాలు లేని బడి నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం గతేడా జూలైలో మార్గదర్శకాలు జారీ చేసింది. 6 నుంచి 8 తరగతుల వరకు విద్యార్థులకు ఏడాదికి 10 రోజులు బ్యాగు లేని బడి నిర్వహించాలని మార్గదర్శకాలు చెబుతున్నాయి. అయితే ఈ నిబంధనల అమలు చేసిన దాఖలాలు ఏక్కడా కనిపించడం లేదు. ప్రతి శనివారం నో బ్యాగ్ డే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ ఏడాదైనా అమలు చేస్తే ఒక్క రోజైనా విద్యార్థులకు బడి సంచి భారం తగ్గుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

> **స్థాయికి మించి బరువు ప్రమాదకరం**
>
> విద్యార్థులు తమ స్థాయికి మించి బరువు మోస్తే పలు రకాల ఆరోగ్య సమస్యలు బారిన పడే అవకాశం ఉంది. వెన్ను, కండరాల నొప్పులకు దారి తీస్తుంది. మానసిక సమస్యలు కూడా ఏర్పడవచ్చు. చదువుపై ఏకాగ్రత తగ్గుతుంది. ఒత్తిడి లేని బోధన విద్యార్థులకు అందించడం అవసరం. విద్యార్థులు మోయలేనంతగా స్కూలు బ్యాగు ఉండకూడదు.
>
> – స్వాతి కిరణ్, వైద్యాధికారి, వేటపాలెం

మేము సైతం.. 'గౌతమ బుద్ధ'

- గ్రామంలో పూడుకుపోయిన కాలువలు శుభ్రం


గ్రామంలోని చినవంతెన సెంటర్‌లో వ్యర్థాలు


గౌతమ బుద్ధ సొసైటీ ద్వారా శుభ్రం చేయించిన తర్వాత..

కారంచేడు: గ్రామ పంచాయతీలో మురుగు కాలువలను శుభ్రం చేయాల్సిన పాలకపక్షం, పంచాయతీ అధికారుల బాధ్యతలను గ్రామానికి చెందిన అభివృద్ధి కమిటీ గౌతమ బుద్ధ సొసైటీ భుజాన వేసుకుంది. మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలో అనేక మంది ఉత్సాహవంతులు గ్రామ అభివృద్ధికి కమిటీగా ఏర్పడ్డారు. గౌతమ బుద్ధ సొసైటీగా నామకరణం చేసి రిజిస్టర్ చేయించారు. మంగళవారం గ్రామంలోని చినవంతెన సెంటర్‌లో ప్రధాన మురుగు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కాలువలో తాగిపడేసిన వాటర్ బాటిల్స్ నుంచి, చెత్తా, చెదారం, అట్ట ముక్కలు, బిరియానీ ప్యాకెట్లు, ఉల్లిపాయల ఖాళీ సంచులు వంటి అనేక వ్యర్థాలతో నిండిపోయింది. దానిని వెంటనే శుభ్రం చేయించారు. అక్కడ నుంచి ప్రధాన మురుగు కాలువకు అనుసంధానంగా ఉన్న అన్ని ప్రాంతాల నుంచి వచ్చే కాలువను సైతం శుభ్రం చేయించారు. సొసైటీ సభ్యులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

కోలాహలంగా మార్కెట్ పరిసరాలు


అమ్మకానికి సిద్ధంగా ఉంచిన పత్రి

చీరాల రూరల్: వినాయక చవితి పర్వదినం సందర్భంగా చీరాల పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. గణనాథునికి సమర్పించే పూజా సామాగ్రి అయిన పత్రికి డిమాండ్ పెరిగింది. సంఘం థియేటర్ నుంచి కూరగాయల మార్కెట్ వరకు పత్రి విక్రయించేవారితో సందడి వాతావారణం నెలకొంది. పండ్లు, ఆకులు, గడ్డిపోచలన కట్టలుగా కట్టి రూ. 30 నుంచి రూ. 50 వరకు విక్రయిస్తున్నారు. అరటి ఆకులను రేపల్లె, వేమూలు ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్నారు.

అక్రమంగా యూరియా నిల్వ చేస్తే చర్యలు


డిటర్జెంట్ తయారీ ఏజెన్సీ పరిశీలిస్తున్న అధికారులు

జె.పంగులూరు: మండల పరిధిలో అక్రమంగా యూరియా నిల్వ చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, యూరియా నిల్వలపై రికార్డులు సరిగా లేకుంటే దుకాణం సీజ్ చేస్తామని మండల తహసీల్దార్ సింగారావు, ఏఓ సుబ్బారెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని మండల స్థాయి ఎన్‌ఫోర్సుమెంట్ టీం మంగళవారం డిటర్జెంట్ బార్లు తయారు చేసే శివ విఘ్నేశ్వర ఇండస్ట్రీస్ పరిశ్రమ తనిఖీ చేశారు. యూరియా వాడకంపై ఆరా తీసి, డిటర్జెంట్‌లను పరిశీలించారు. అనంతరం రేణింగవరంలో జయ ఆగ్రో ఏజెన్సీస్, రేణింగవరం ఎరువులు షాపును పరిశీలించి యూరియా నిల్వలపై గూడేన్ని పరిశీలించారు. పంగులూరులోని మన గ్రోమోర్ సెంటర్‌లో 417 యూరియా బస్తాలు నిల్వ ఉన్నట్లు గుర్తించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సింగారావు మాట్లాడుతూ ఎరువు షాపు యజమానులు కానీ అక్రమాలకు పాల్పడినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అవసరమైన ఎరువులను రైతులకు సకాలంలో అందించాలన్నారు.

బూచేపల్లి వెంకాయమ్మకు జన్మదిన శుభాకాంక్షలు


బూచేపల్లి వెంకాయమ్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

మార్టూరు: ప్రకాశం జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మకు మంగళవారం మార్టూరు వైఎస్సార్ సీపీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో బూచేపల్లి వెంకాయమ్మకు ఆమె కుమారుడు దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డికి.. నాయకులు శాలువాతో సత్కరించి మొక్కలను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. గర్నెపూడి రవిచంద్ ఆయన భార్య అనూష, పర్చూరు నియోజకవర్గ పంచాయతీ రాజ్ అధ్యక్షుడు ఆసోది బ్రహ్మారెడ్డి, ద్రోణాదుల గ్రామ సర్పంచ్ వంకాయలపాటి భాగ్యరావు, బొల్లాపల్లి బెంజిమెన్, నూకతోటి శామ్యూల్, దొప్పల పూడి నాగార్జున పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మకు శుభాకాంక్షలు


జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మకు శుభాకాంక్షలు తెలుపుతున్న బ్రహ్మానందరెడ్డి

చినగంజాం: ఉమ్మడి ప్రకాశం జిల్లా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ జన్మదినం పురస్కరించుకొని మంగళవారం పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. చీమకుర్తిలోని ఆమె నివాస గృహం వద్ద కేక్ కట్ చేయించారు. దర్శి శాసన సభ్యుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, ఎం. హేమంత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


సజ్జల రామకృష్ణారెడ్డితో బల్లికురవ, సంతమాగులూరు మండలాల కన్వీనర్లు

బల్లికురవ: గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు అర్థమయ్యేలా తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోర్డినేటర్ సజ్జల రామకృష్ణా రెడ్డి కోరారు. మంగళవారం తాడేపల్లిలోని కార్యాలయంలో ఆయన్ను.. బల్లికురవ, సంతమాగులూరు మండలాల కన్వీనర్లు దేవినేని కృష్ణబాబు, వూట్ల నాగేశ్వరరావు, మర్యాద పూర్వకంగా కలిశారు. భవిష్యత్ కార్యాచరణ పై చర్చించారు. గ్రామ, బూత్ కమిటీల ఎంపికతో పాటు బాబు షూ్యరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాలను ప్రతి గ్రామంలో నిర్వహించాలన్నారు. ఈ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందని, కక్ష సాధింపే ధ్యేయంగా కూటమి పాలన సాగుతోందని రామకృష్ణారెడ్డి అన్నారు. రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి

అద్దంకి రూరల్: గ్రామ పంచాయితీల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీడీవో శింగయ్య అన్నారు. మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

వేధింపులు తగవు

అద్దంకి: ఆర్టీసీ ఉద్యోగులను అసిస్టెంట్ మేనేజర్ వేధింపులకు గురిచేయడం తగదని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అయ్యప్పరెడ్డి అన్నారు. అసిస్టెంట్ మేనేజర్‌ను రిలీవ్ చేయాలని కోరుతూ ఏపీఎస్ఆర్టీసీ అద్దంకి డిపోలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డిపో కార్యదర్శి డీవీవీ సుబ్బారావు అధ్యక్షత వహించారు. బాపట్ల జిల్లా కార్యదర్శి పి. తిరుపతిరెడ్డి, ముఖ్య వక్తగా రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఎం. అయ్యప్ప రెడ్డి పాల్గొన్నారు. అద్దంకి డిపో అసిస్టెంట్ మేనేజర్ వేధింపులకు వ్యతిరేకంగా ధర్నా కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. కలెక్షన్లు తక్కువగా వచ్చాయనే సాకుతో ప్రతి కార్మికుని వేధించడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బైపాస్ సర్జరీ చేయించుకున్న ఏడీసీ జయసింహారెడ్డికి ఒంగోలు డిపోకు ట్రాన్స్ఫర్ వచ్చినప్పటికీ రిలీవ్ చేయకుండా వేధింపులకు గురి చేస్తున్నారు. 300 మంది కార్మికులు పనిచేయుచున్న అద్దంకి డిపోలో టాయిలెట్స్ తాగు నీరు, టిమ్స్, పేపర్ రోల్స్, బస్సుల్లో చార్జింగ్ పాయింట్లు సమకూర్చాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఏడీసీ ఎస్. జయసింహారెడ్డిని ఈ డిపో నుంచి రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు, సీఐటీయూ అనుబంధ సంఘాలు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

తోటవారి ధర్మ సత్రం వివరాలు తెలియజేయాలి

చినగంజాం: స్థానిక తోట వారి ధర్మసత్రం స్థలానికి సంబంధించి అక్కడ నిర్వహించే కార్యక్రమాల సమాచారాన్ని దాతలైన పెద్దతోట వంశస్తులకు తెలియజేయాలని తోట శ్రీనివాసరావు, రామ చంద్రప్రసాద్, తోట హరనాథ్ తదితర వంశీయులు ఓ ప్రకటనలో కోరారు. 150 ఏళ్ల క్రితం బాటసారుల విశ్రాంతి భవనం నిర్మాణం చేశారని.. కాగా ఇటీవల ఆ స్థలంలో భవనం నిర్మాణాలు చేస్తున్నట్లు తమకు తెలిసిందని చెప్పారు. ఆ సమాచారాన్ని దేవాదాయ శాఖ ఈఓ గాని, భవనం నిర్మాణం చేస్తున్న నిర్వాహకులుగాని తెలియజేయక పోవడం విచారకరమన్నారు. ఈ మేరకు కలెక్టర్ జె. వెంకట మురళికి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.


చీరాల: మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు


తిమ్మాయపాలెంలోని భారీ వినాయక విగ్రహం


బల్లికురవ ప్రాంతంలో చేరుకున్న గణనాథులు


అద్దంకి: పల్లెలకు చేరుతున్న విగ్రహాలు

క్లే వినాయకా.. జై నాయకా!

చీరాల అర్బన్: మట్టి వినాయక ప్రతిమలే పర్యావరణానికి మేలు చేస్తాయని ఆర్డీఓ టి.చంద్రశేఖర్ నాయుడు అన్నారు. వినాయక చవితి సందర్భంగా చీరాల్లోని కొట్లబజారులో ఓగటి శ్రీనివాస శాస్త్రి ఆధ్వర్యంలో సిద్ధూనాథ్, విశ్వనాథ్, యశ్వంత్ సౌజన్యంతో వెయ్యి మట్టి వినాయక ప్రతిమలు, వ్రతకల్పం పుస్తకాలను ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు చేతుల మీదుగా మంగళవారం ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. 2015 నుంచి కాలుష్య నియంత్రణలో భాగంగా పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఏడాది మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్న యువతను ఆర్డీఓ ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ వీరిని స్ఫూర్తిగా తీసుకుని మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. తహసీల్దార్ గోపికృష్ణ, డీఏ ముసలయ్య, సీఐ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

చీరాల ఎస్ఆర్‌పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గరల్స్ హైస్కూల్ సెంటర్ మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద రూ.28 వేలు విలువ గల 1500 మట్టి వినాయక ప్రతిమలను, వ్రతకల్పం పుస్తకాలను ప్రజలకు పంపిణీ చేశారు. అలానే గోశాలలోని గోవుల పోషణ నిమిత్తం రూ.1500 అందించారు. పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ళ గురుప్రసాద్, గ్రంధి నారాయణమూర్తి, గెల్లి అమర్‌చంద్, మాదల చిన సుబ్బారావు వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

వేటపాలెం: రైల్వే స్టేషన్ రోడ్డులో గల రోటరీ కమ్యూనిటీ హాలు ముందు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో 200 మట్టి గణపతి విగ్రహాలను, క్లబ్ సభ్యులు మంగళవారం పంపిణీ క్లబ్ అధ్యక్షుడు ఏవీ సురేష్, అక్కల చంద్రశేఖర్ రెడ్డి, గొల్లపూడి సీతారం తదితరలున్నారు.

అద్దంకి: వినాయక చవితిని పుర్కరించుకుని మంగళవారం గణనాథుని విగ్రహాలు పల్లెలకు తరలాయి. అద్దంకి పట్టణం నుంచి పరిసర గ్రామాల ప్రజలు విగ్రహాలను కొనుగోలు చేసి ట్రాక్టర్లు, లారీలు, బండ్లపై విగ్రహాలను తరించారు. సుమారు 400 పైగా విగ్రహాలు పల్లెలలకు తరలాయి. మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలో 22 అడుగుల విగ్రహాన్ని రూ.1.5లక్షలతో కొనుగోలు చేసి ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేశారు.

పర్చూరు(చినగంజాం): పర్చూరు రోటరీ గంగ వద్ద రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ పర్చూరు సెంట్రల్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, కోమటి ఆంజనేయులు, నాగబైరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జె.పంగులూరు: వినాయక చవితి పురస్కరించుకొని మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మంగళవారం వినాయ మండపాలు ఏర్పాట్లు చేస్తున్నారు. అవాంఛనీయ సంఘటన జరగకుండా ఉండేదుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

చినగంజాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం మట్టి వినాయక విగ్రహాలు తయారు చేసి పంచి పెట్టారు. శ్రీలక్ష్మి, ఎస్. నరసింహారావు, సుబ్బారావు, కోటిరెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యద్దనపూడి: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకుందామని అందుకు ప్రజలు.. అధికారులు సహకరించాలని మార్టూరు సీఐ జీఎల్ శ్రీనివాసరావు అన్నారు. యద్దనపూడి పోలీస్ స్టేషన్ ఆవరణలో మాట్లాడారు. మండపాల వద్ద అసభ్యకరమైన నృత్యాలు, డాన్సులు పూర్తిగా నిషేధమని తెలిపారు. ఎస్ఐ రత్నకుమారి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


వేటపాలెంలో మట్టి గణపయ్య విగ్రహాల పంపిణీ


పర్చూరులో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు


పంగులూరులో వినాయ మండపాల ఏర్పాటులో కమిటీ సభ్యులు


చినగంజాం: మట్టి విగ్రహాలను తయారు చేసిన పాఠశాల విద్యార్థులు


యద్దనపూడి: ఉత్సవ కమిటీ నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు


చీరాల: మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు